కోతల వేళ .. రైతుల్లో కలవరం

మంథని : ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

కాల్వశ్రీరాంపూర్: వర్షానికి తడిసిన వడ్లను చూపిస్తున్న రైతు

మంథని/కమాన్‌పూర్, నవంబర్ 1: ప్రస్తుతం వరి పంట కోత దశకు చేరుకుంది. కొన్ని చోట్ల ఇప్పటికే కోతలు షురూ చేశారు. దాన్యం రాశులుగా పోసి ఆరబెడుతున్నారు. అకాల వర్షం ఈ కోతల సమయంలో గత నాలుగైదు రోజులుగా కురుస్తుండడంతో రైతులు పంటలను కోయాలా.. వద్దా అనే సంశయంలో కొట్టుమిట్టాడుతున్నారు. పంట కోసిన రైతుల దాన్యం వానజల్లులకు తడవకుండా నానా పాట్లు పడాల్సిన పరిస్థితి నెలకుంది. ప్రతి ఏటా వరి పంట కోత దశలో అకాల వర్షాలు కురవడం రైతులు దాన్యం తడసిపోవడం.. పొట్ట దశలోని గింజ రాలడం.. రైతులు నష్టపోతూ ఇబ్బందులు పడడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షంతో వరి పంటతో పాటు పత్తి పంటకు కూడ నష్టం జరిగే అవకాశాలున్నాయని, వరి పంటను ఇప్పుడు కోతలు కోయకుండా కొద్ది రోజులు వాయిదా వేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. కోతలు కోసిన వరి దాన్యాన్ని పంట పొలాల వద్దనే దాన్యం తడవకుండా టార్పాలిన్‌తో కప్పుకోవాలని, వాతావరణం పొడిగా ఉన్నప్పుడు వరి దాన్యం నిర్ధేశించిన తేమ శాతం 17 వచ్చే వరకు ఆరబెట్టుకునే అవకాశం ఉంటుందని తెలియజేస్తున్నారు.

ఓదెల, నవంబర్ 1: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఒక్కసారిగా భారీగా వర్షం పడింది. కొలనూర్, ఓదెల, కనగర్తి, పిట్టల ఎల్లయ్యపల్లె, గోపరపల్లి, హరిపురం, లంబాడితండా, నాంపానిపల్లితో పాటు పలు గ్రామాల్లోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డా రు. ఇటీవలే కోసిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పోయగా, అవి ఆకాల వర్షానికి తడిసిపోయాయి. వడ్ల కుప్పలపై టార్పాలిన్ కవ ర్లు కప్పినా, భూమి కింద నుంచి వరద వెళ్లి వడ్లు తడిసినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కాల్వశ్రీరాంపూర్, నవంబర్ 1: మండలంలో బుధవారం రాత్రి , శుక్రవారం ఉదయం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని వడ్ల కుప్పలు తడిసిముద్దయ్యాయి. ఇద్లాపూర్, జాఫర్‌ఖాన్‌పేట, వెన్నంపల్లి లో కోతకు వచ్చిన వరి ఈదురుగాలులకు నేలవాలింది. చేతికందిన ధాన్యం కళ్లముందే తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు సకాలంలో తూకం వేయిస్తే వడ్లు తడిసేవి కాదని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాలకుర్తి, నవంబర్1: మండంలోని పాలకుర్తి, జయ్యారంలోని తడిసిన వడ్లు ఆరబెట్టే విధానాన్ని శుక్రవారం వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు వివరించారు. తడిసిన ధాన్యంలో ఉప్పు చల్లితే తేమను నివారించచ్చన్నారు. ధాన్యం నుంచి తేమను ఉప్పు స్వీకరిస్తుందని రైతులకు వివరించారు. పంటచేతికి వచ్చే సమయంలో కురుస్తున్న అకాల వర్షంతో మండలంలోని రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లోని వడ్ల కుప్పలు వర్షానికి తడుస్తున్నాయి.

వడ్లు అమ్మిన 48 గంటల్లో చెల్లింపులు

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, నవంబర్1: కొనుగోలు కేంద్రాల్లో వడ్లు అమ్మిన రైతులకు 48గంటల్లో చెల్లింపులు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలన్నారు. అకాల వర్షాల పట్ల రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోనేలా చర్యలు చేపట్టాలన్నారు. దొడ్డు, సన్న వడ్లను వేర్వేరుగా సేకరించి మిల్లులకు రవాణా చేయాలని సూచించారు. సమావేశంలో డీఏవో ఆది రెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీమాల, డీఆర్డీవో రవీందర్, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ ఎం శ్రీకాంత్, డీఎంవో ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్షిత బావిలో నక్క కళేబరం

- నీరు వాసన రావడంతో వెలుగులోకి
- గోపాల్‌రావుపేటలో ఘటన

ధర్మారం,నవంబర్1: గోపాల్‌రావుపేటలో రక్షిత బావిలో నక్క కళేబరం కలకలం రేపింది. బావి నుంచి సరాఫరా చేస్తున్న నీరు దుర్వాసన రావవంతో అనుమానం వచ్చి స్థానికులు బావి వద్దకు వెళ్ల పరిశీలించారు. అందులో నక్క పడి మరణించిన ఘటన వెలుగు చూసింది.ఈ ఘటనలో పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలోని బావి నుంచి కాలనీ వాసులకు తాగునీరు సరఫరా అవుతున్నది. కాలనీ వాసులు నీళ్లు పట్టకుంటున్న సమయంలో వాసన వచ్చింది. అనుమానంతో వారు బావి వద్దకు వెళ్లి చూడగా అందులో నక్క కళేబరం కనిపించింది. ఈ విషయంతెలిపేందుకు పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదని గ్రామస్తులు ఆరోపించారు. స్థానికులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో డీపీవో వీర బుచ్చయ్య, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీవో కే రమేష్ స్పందించి పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. మాజీ ఉప సర్పంచ్ మేకల రాజయ్య, మరో వ్యక్తి కలిసి పంచాయతీ సిబ్బంది సమక్షంలో నక్క కళేబరానిన తీశారు. అనంతరం బావిలోని నీటిని పూర్తిగా తోడివేశారు. బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయించారు. దీనిపై కార్యదర్శి అహ్మద్ మొహియొద్దీన్‌ను వివరణ కోరగా గ్రామానికి వెళ్లి నక్కను కళేబరాన్ని తీయించానని చెప్పారు. కాగా అదే గ్రామంలో పంజాల శ్రీనివాస్ ఇంటి ఎదుట ఉన్న రోడ్డుపై ప్రమాదవశాత్తు కుక్క మరణిస్తే రోజంతా గడిచిన దానిని తొలగించడంలో జీపీ సిబ్బంది నిర్లక్షం చేశారని కార్యదర్శికి చెబితే పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం అధికారులు గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం కార్యదర్శికి మెమో జారీచేశారు.

సెక్టార్ -1 స్కూల్ సందర్శన

గోదావరిఖని, నవంబర్ 1: సింగరేణి ఆర్జీ-1లోని సెక్టార్ -1 సింగరేణి హైస్కూల్‌ను సింగరేణి కార్పొరేట్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించిన ఆయన కష్టపడి చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. హెచ్ఎం శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ఉపాధ్యాయులు స్వర్ణలత, కుమారస్వామి, సుజాత ఉన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, నవంబర్ 1 : ఆర్జీ-2 ఏరియాలోని సింగరేణి సెక్టార్-3 పాఠశాలను ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా పాఠశాలలో చేపడుతున్న మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేయాలని సూచించారు. ఆయన హెచ్ఎం సుందర్ రావు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కమాన్‌పూర్, నవంబర్ 1: ఈ నెల16 న జాతీయ పత్రికాదినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మపీఠం విశ్వమానవ వికాస కేంద్రం ఆధ్వర్యంలో డిజిటల్ పత్రిక, ప్రింట్ మీడియా, సోషల్ మీడియా యూట్యూబ్ మీడియా రంగాల్లో విశేషంగా కృషి చేస్తున్న ఉత్తమ జర్నలిస్టులకు అవార్డులు అందజేయనున్నట్లు సభ్యుడు కూచన మల్లయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. మానవీయ, సమాజ హితమైన కథనాలను ఈ నెల 8వ తేది సాయంత్రం 5 గంటల వరకు వాట్సాఫ్ నెం: 7095026350కు పంపించాలని కోరారు. వీడియో 5 నిమిషాలలోపు మాత్రమే ఉండాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ జర్నలిస్ట్ అవార్డుతో పాటు ప్రతి జిల్లాకో ఉత్తమ జర్నలిస్టుకు ప్రశంస పత్రం అందజేయడం జరుగుతుందని వెల్లడించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలి

పెద్దపల్లి టౌన్, నవంబర్1: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కార్యకర్తలు పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై యాకయ్య పిలుపునిచ్చారు. సీపీఎం పెద్దపల్లి మండల రెండో మహాసభ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను సీనియర్ నాయకుడు కల్లెపల్లి అశోక్ ఎగుర వేశారు. పార్టీ నేత సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడారు. జిల్లా కేంద్రంలో బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, కూనారం-పెద్దపల్లి రైల్వే లైన్‌పై నిర్మిస్తున్న పనులను శరవేగంగా చేపట్టాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇవ్వాలని, జిల్లా కేంద్రంలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇక్కడ పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు ఎరవెల్లి ముత్యంరావు, నాయకులు సీపెల్లి రవీందర్, జిల్లేల ప్రశాంత్, మోదుంపల్లి శ్రావణ్, సీపెల్లి దిలీప్, ఖాజా, వెంటస్వామి, లింగయ్య, చంద్రయ్య పాల్గన్నారు.

బీసీ ఏలో చేర్చాలని వినతి

పెద్దపల్లి రూరల్, నవంబర్ 1: చేతి వృత్తినే నమ్ముకుని భవననిర్మాణ కార్మికులుగా పని చేస్తున్న సగరులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి చేర్చేలా చర్యలు తీసుకోవాలని బీసీ కమిషన్ సభ్యులకు జిల్లా సగర సంఘం సభ్యులు విన్నవించారు. ఈ మేరకు కరీంనగర్‌లో శుక్రవారం కమిషన్ సభ్యులను కలిసి పలు డిమాండ్లలో కూడిన వినతి పత్రాన్ని వారికి అందజేశారు. ఇక్కడ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మర్కులక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యాదర్శి గాండ్ల మోహన్, జిల్లా కోశాధికారి దేవునూరి తిరుపతి, మాజీ ఎంపీటీసీ తాడి చెట్టి సదయ్య ఉన్నారు.

నేడు వేలం

పెద్దపల్లి రూరల్, నవంబర్ 1: దేవునిపల్లి శ్రీ లక్ష్మీనృసింహ స్వామి జాతరలో కొబ్బరి కాయలు, పులిహోర, ప్రసాదం, పేలాలు, పుట్నా విక్రయానికి శనివారం వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ముద్దసాని శంకరయ్య తెలిపారు. దేవాదాయశాఖ నిబంధనల ప్రకారం కొబ్బరికాయలు రూ.50 వేలు, పులిహోర, ప్రసాదం రూ.50 వేలు, పుట్నాలు, పేలాలు రూ.10 వేలకు వేలం వేయనున్నట్లు వివరించారు.ఆసక్తిలవారు వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు .

కొప్పులకు సన్మానం

ధర్మారం,నవంబర్1: మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకులు సన్మానించారు. ఈశ్వర్ ఆఫ్రికా పర్యటనను ముగించుకుని స్వదేశానికి వచ్చారు. కరీంనగర్‌లో ఈశ్వర్‌ను ఆవుల లత, కాంపెల్లి అపర్ణ,మార్క సంధ్య, కాల్వ శిరీష తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏఐఎఫ్‌బీలో చేరిక

పెద్దపల్లి టౌన్, నవంబర్1: రాగినేడుకు చెందిన పెర్కు రాజమల్లు శనివారం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరారు. ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొంకూరి సురేందర్‌కు రాజమల్లు కృతజ్ఞతలు తెలిపారు.

గుండెవ్యాధులపై అవగాహన

గోదావరిఖని, నవంబర్ 1: ఆర్జీ-1 ఆధ్వర్యంలో శుక్రవారం ఓపెన్‌కాస్ట్- 5లో ఉద్యోగులకు గుండెకు సంబంధించిన వ్యాధి, బీపీ, మధుమేహంపై అవగాహన సదస్సు నిర్వహించారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కారం పద్మ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఇక్కడ మేనేజర్ రమేశ్ బాబు, అడిషనల్ మేనేజర్ రాములు, పోనగోటి శ్రీనివాస్, యూనియన్ సెక్రటరీ ప్రభుదాస్, అధికారులు ఉన్నారు.

పకడ్బందీగా ఇంటింటా సర్వే పూర్తి చేయాలి

జూలపల్లి : స్టిక్కర్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కోల్‌సిటీ, నవంబర్ 1: గడువులోగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం కమిషనర్ జే అరుణ శ్రీ ఆదేశించారు. రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఆర్జీ-1 కమ్యూనిటీ హాలులో శుక్రవారం ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సంర్భంగా ఆమె మాట్లాడారు. తమకు కేటాయించిన ఎన్యుమరేటర్ బ్లాక్‌లోని అన్ని ఇళ్లను సందర్శించాలని సూచించారు. సర్వే షెడ్యూల్ ముందుగా తెలిపి కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ధరణి పాస్ పుస్తకం అందుబాటులో ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సర్వేపై డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ లింగారెడ్డి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ రాజలింగు, ఈఈ రామన్, టీపీఎస్ నవీన్, సూపరింటెండెంట్ ఆంజనేయులు, ఆర్ ఐలు శంకర్ రావు, కరుణాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, మెప్మా టీఎంసీ ఊర్మిళ, సీవోలు, ఆర్పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. నగరంలోని 446 ఎన్యుమరేషన్ బ్లాకులను విభజించి ఒక్కో బ్లాక్‌కు 150 నుంచి 175 వరకు ఇండ్లు కేటాయించారు. అనంతరం ఎన్యుమరేటర్లకు సర్వే సామగ్రిని అందజేశారు.

బల్దియాలో 65,847 ఇండ్లు

రామగుండం నగర పాలక సంస్థ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ఏర్పాట్లు పూర్తి చేసింది. నగరంలోని 50 డివిజన్లలో 65,847 ఇండ్లు ఉన్నాయి. వీటిని 150 నుంచి 175 వరకు ఇండ్లకు ఒక బ్లాక్ చొప్పున 446 ఎన్యుమరేషన్ బ్లాక్‌లుగా విభజించారు. ఒక్కో బ్లాక్‌లో సర్వే చేసేందుకు ఒక్కో ఎన్యుమరేటర్‌ను కేటాయించారు. సర్వే నిర్వహణ తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి 51 మంది సూపర్‌వైజర్లకు బాధ్యతలు అప్పగించారు. సర్వే ప్రారంభానికి ముందే ఇంటింటికీ వెళ్లి సర్వే ఉద్దేశాన్ని ఇంటి యజమాని, కుటుంబ సభ్యులకు వివరిస్తున్నారు. సర్వే సిబ్బంది షెడ్యూల్ వివరిస్తూ ఆధార్, ఆహార భద్రత కార్డు, పట్టా పాస్ పుస్తకం కాపీలు దగ్గర ఉంచుకోవాలని సూచిస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన స్టిక్కర్ అంటిస్తున్నారు.

జూలపల్లి, నవంబర్ 1 : మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు అధికారులు సన్నాహాలు మొదలు పెట్టారు. ఆయా గ్రామాల్లో ఎన్యుమరేటర్లు కుటుంబాల సర్వే పనులు చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి గోడలకు స్టిక్కర్లు అంటించారు. ప్రతి ఇంట్లో రేషన్, ఆధార్ కార్డులు, పట్టా దారు పాస్‌పుస్తకాలు అందుబాటులో ఉంచుకొని సర్వేకు పూర్తి సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. సర్వేకు 74 మంది సిబ్బందిని నియమించామని ఎంపీడీవో పద్మజ వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 6 నుంచి ఎన్యుమరేటర్లు సర్వే ప్రారంభిస్తారని తెలిపారు.

కమాన్‌పూర్, నవంబర్ 1: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా మండలంలోని తొమ్మిది పంచాయతీల్లో 78 మంది ఎన్యుమరేటర్లు ఇండ్ల వివరాల సేకరణలో భాగంగా స్టిక్కర్లు అంటించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జూలపల్లిలో సర్వే నిర్వహణ తీరును ఎంపీడీవో లలిత పరిశీలించారు. ఎన్యుమరేటర్లతో కలిసి ఇండ్లకు స్టిక్కర్ అంటించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడారు. ఇండ్ల వివరాల సేకరణ కార్యక్రమం మూడు రోజుల పాటు కొనసాగనుందన్నారు. ఇండ్ల గుర్తింపు అనంతరం ఎన్యుమరేటర్లకు సర్వే పత్రాల అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 6 నుంచి 18 వరకు ఎన్యుమరేటర్ల సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియ కొనసాగుతుందన్నా రు. 19 నుంచి 27 వరకు డాటా ఎంట్రీ ఉంటుందని వివరించారు. 27 నుండి 30 వరకు రిపోర్ట్స్ అందజేసే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎంపీవో భాస్కర్ పాల్గొన్నారు.

ముత్తారం, నవంబర్ 1: మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైంది. మండల కేంద్రంలో ఎన్యూమరేటర్లు సర్వే చేపట్టారు. సర్వే ప్రారంభానికి ముందే ఇంటింటికి వెళ్ళి సర్వే ఉద్దేశ్యాన్ని ఇంటి యజమాని, కుటుంబ సభ్యులకు వివరించారు. సర్వే సిబ్బంది షెడ్యూల్ వివరిస్తూ ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు, పట్టా పాస్ పుస్తకం కాపీలు దగ్గర ఉంచుకోవాలని ఇప్పటికే సూచించారు. సందర్శించిన ఇంటికి ప్రభుత్వం పంపిణీ చేసిన స్టిక్కర్ అంటించారు. ఇక్కడ ఎంపీడీవో సురేశ్ , కార్యదర్శి నరేశ్ , సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్జీ-3లో రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి

రామగిరి, నవంబర్ 1: సింగరేణి వ్యాప్తంగా ఆర్జీ-3 డివిజన్ అక్టోబర్‌లో రికార్డు స్థాయిలో 119 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం ఎన్ సుధాకర్ రావు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం గత నెల బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. అక్టోబర్‌లో ఆర్జీ-3 ఏరియాకు నిర్దేశించిన 4.39 లక్షల టన్నుల లక్ష్యానికి గానూ 5.22 లక్షల టన్నులతో 119 శాతం బొగ్గు ఉత్పత్తి తోపాటు నిర్దేశించిన 42.70 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత లక్ష్యానికి గాను 37.65 లక్షల క్యూబిక్ మీటర్లు 88 శాతం వెలికితీసినట్లు తెలిపారు. అదే విధంగా 6.04 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు వివరించారు. ఓసీపీ-1కు నిర్దేశించిన 2.19 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 2.46 లక్షల టన్నులతో 112 శాతం, ఓసీపీ-2 గనికి నిర్దేశించిన 2.20 లక్షల టన్నుల లక్ష్యానికి 2.76 లక్షల టన్నులు 126 శాతం ఉత్పత్తి చేసినట్లు వివరించారు.ఇందుకు శ్రమించిన ఉద్యోగులను ఆయన అభినందించారు.

ఏపీఏలో బొగ్గు ఉత్పత్తి...

ఏపీఏ ఏరియాలో అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టుకు అక్టోబర్‌లో నిర్దేశించిన 0.08 లక్షల టన్నుల లక్ష్యానికి 0.26 లక్షల టన్నులకు గానూ 315 శాతం బొగ్గు ఉత్పత్తితో 0.16 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందుకు కృషి చేసిన ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. సింగరేణిలో కొత్తగా బదిలీ వర్కర్లుగా ఉద్యోగంలో చేరుతన్న వారు అధికారులు, సూపర్‌వైజర్లు, సీనియర్ ఉద్యోగుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సుల్తానాబాద్, నవంబర్ 1: సుల్తానాబాద్ ఖోలో ఇండియా క్రీడాకారుడు కూకట్ల అఖిల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు అంతర్జాయతీయ క్రీడాకారుడు గెల్లు మధుకర్‌యాదవ్ తెలిపారు. జగిత్యాల జిల్లా మేడిపల్లిలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోటీల్లో పెద్దపల్లి జట్టు నుంచి పాల్గొన్న అఖిల్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని వివరించారు. పట్టణంలోని మినీ స్టేడియంలో ఖేలో ఇండియా క్యాంప్‌లో శిక్షణ పొందిన అనతి కాలంలో రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికకావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ..

పాలకుర్తి, నవంబర్ 1:జీడినగర్ యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయినట్లు కరస్పాండెంట్ ఇస్మాయిల్ తెలిపారు. పాఠశాలకు చెందిన జీ సుశాంత్, జీ ఆర్జవ్, ఎస్ శాశ్వంత్ ఎంపికయ్యారు. నవంబర్ 2 నుంచి మెదక్‌లో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ ఇస్మాయిల్, హెచ్ఎం సయ్యద్‌అష్జల్ అభినందించారు.

కుర్చీలు వితరణ

జ్యోతినగర్(రామగుండం), నవంబర్ 1: దీపావళి పండుగను పురస్కరించుకొని రామగుండంలోని తబితా ఆశ్రమానికి ఓదెల రాజమౌళి సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆశ్రమానికి పది కుర్చీలు వితరణ చేశారు. ఆశ్రమంలోని పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. వారితో బాణాసంచా కాల్చి పండుగ వేడుకలు నిర్వహించారు. నాయకులు ఈదునూరి హరిప్రసాద్, అప్పా సి శ్రీనివాస్, తాజ్‌బాయ్, ఎండీ గౌస్‌బా బా, యూసుఫ్‌ఖాన్, గుర్రం అంజయ్య, సయ్యద్ అన్వర్, మమ్మద్ సలావుద్దీన్ ఉన్నారు.

పరామర్శ

ముత్తారం, నవంబర్ 1: కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తల్లి లక్ష్మీనర్సవ్వ ఇటీవల మరణించగా మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన బీఆర్ ఎస్ నాయకులు గురువారం రాత్రి కమలాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇక్కడ మర్కెట్ కమీటి మాజీ వైస్ చైర్మన్ నాంపాని సమ్మయ్య, మాజీ ఉప సర్పంచ్ మద్దెల దివాకర్, తెరాస గ్రామ శాఖ అధ్యక్షుడు నిమ్మతి రమేష్, ముదిరాజ్ సంఘం నాయకులు దామ మల్లేశ్, రమేశ్ , మండల రవి, గట్టయ్య, కుమార్ , శ్రీను, చిగురు విద్యాసాగర్ పాల్గొన్నారు.

నూతన చైర్మన్లకు సన్మానం

సుల్తానాబాద్, నవంబర్ 1:జిల్లా గ్రంథాయ సంస్థ చైర్మన్‌గా అంతటి అన్నయ్యగౌడ్, సుల్తానాబాద్ ఏఎంసీ చైర్మన్‌గా మినుపాల ప్రకాశ్ రావు నియమితులు కాగా, సుల్తానాబాద్ సర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. శుక్రవారం వారిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ కందుకూరి ప్రకాశ్ రావు, సాయిరి మహేందర్, ఈశ్వరాచారి, సత్యనారాయణ, ప్రదీప్, కందుకూరి లక్ష్మీనారాయణ, రాజమౌళి ఉన్నారు.

కమాన్‌పూర్, నవంబర్ 1: గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్‌ను మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఇక్కడ మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు నగునూరి సనర్సయ్య, ఉపాధ్యక్షులు పొన్నం వెంకన్న , నాయకులు రంగు శ్రీనివాస్, తిరుపతి, కోల నర్సాగౌడ్, వెంగలి రాజయ్య, గట్టు సతీష్, మల్యాల మహేష్, పంజా సాయిరాంగౌడ్ ఉన్నారు.

ఖని ప్రభుత్వ దవాఖానలో 213 ప్రసవాలు

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 1: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ దవాఖానలో ప్రసవాలు రికార్డు స్థాయిలో జరుగుతున్నాయి. గత నెలలో 213 ప్రసవాలు చేసి రికార్డు సృష్టించారు. గత నెల 15న 24గంటల్లో 20 ప్రసవాలు చేసి రికార్డులను తిరగ రాసిన దవాఖాన ఓవరాల్‌గా గత నెలలో అత్యధికంగా 213 డెలివరీలు చేశారు. దీంతో దవాఖాన హెచ్‌వోడీ గైనకాలజీ విభాగం సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఈ ఏడాది మార్చిలో 140 ప్రసవాలు, ఏప్రిల్-128, మే- 148, జూన్-129, జూలై-166, ఆగస్టు-177, సెప్టెంబర్-169, అక్టోబర్‌లో 213 ప్రసవాలు చేశారు. ఒకరోజులో 400మంది డెలివరీలు చేసేందుకు దవాఖానలో సకల మౌలిక సదుపాయాలు ఉన్నాయని హెచ్‌వోడీ వైద్య బృందం పేర్కొంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

పెద్దపల్లి టౌన్, నవంబర్ 1: కలెక్టరేట్‌లో వుమెన్స్,చిల్డ్రన్, సీనియర్ సిటిజన్ ప్రొటెక్షన్ విభాగంలో జెండర్ స్పెషలిస్టుగా తాత్కాలిక ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న రోడ్డ స్వప్న (35) అలియాస్ చంద్రు స్వప్న హైదరాబాద్ గాంధీ దవాఖాన లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గత నెల 29న సాయంత్రం 6గంటల సమయంలో సహోద్యోగి ప్రవీణ్ అనే వ్యక్తి స్కూటిపై పెద్దపల్లి నుంచి మంథని మండలం సూరయ్యపలిలోని నివాసానికి వెళ్తుండగా శాంతినగర్ సమీపంలో గుర్తు తెలియని కారు వెనుక నుంచి ఢీకొనడంతో స్వప్న తలకు తీవ్ర గాయమైంది. వెంటనే ఆమెను కరీంనగర్‌లోని ఓ ప్రవేట్ దవాఖానకు, అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు స్వప్న సోదరుడు చంద్రు విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. స్వప్నకు ఇద్దరు కూతుళ్లు ఉన్నట్లు తెలిపారు. భర్త మృతి చెందగా జిల్లా కలెక్టరేట్‌లో తాత్కలిక ఉద్యోగిగా పనిస్తున్నట్లు వివరించారు. శాంతినగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై అనుమానులు వ్యక్తమవుతున్నట్లు త